సాక్షి
అన్నమయ్య జిల్లా

బుధవారం । 10 । జనవరి । 2024



కల సాకారం
వైద్య రంగంలో అడుగు పెట్టాలని కలలు గన్న వందలాది మంది విద్యార్థులు తమ కలలను సాకారం చేసుకుని బుధవారం పట్టాలు అందుకోనున్నారు. -8లో



డీసీసీ బ్యాంక్ మెరుగైన సేవలు
కమర్షియల్ బ్యాంకులతో సమానంగా డీసీసీ బ్యాంకు సేవలు అందిస్తోందని డీసీసీ, ఆప్కాబ్ బ్యాంక్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీ రాణి తెలిపారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.190	రూ.260
రెండోరకం	రూ.100	రూ.186

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 101 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

13 నుంచి వైవీయూకు సంక్రాంతి సెలవులు
వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలలకు ఈ నెల 13 నుంచి 20వ తేదీ వరకు సంక్రాంతి సెలవులు ప్రకటించినట్లు వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య తెలిపారు. జీసీటీఏ, జీసీజీటీఏ సంఘాల వినతి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. 21వ తేదీ ఆదివారం అయినందున, తిరిగి 22వ తేదీ తరగతులు పునఃప్రారంభమవుతాయన్నారు.

పీహెచ్‌ఎన్ పదోన్నతుల కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఆర్డీ రత్నకుమారి

కడప రూరల్: వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం (రాయలసీమ జిల్లాలు) జోన్-4 పరిధిలో మంగళవారం స్టాఫ్‌నర్స్ నుంచి పీహెచ్ఎన్ టీచింగ్ పదోన్నతుల కౌన్సెలింగ్ ప్రశాంతంగా జరిగింది. 31 మందికి గాను 21 మంది హాజరై పదోన్నతులు పొందారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన వారికి పదోన్నతులు కల్పించినట్లు ఆ శాఖ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ రత్నకుమారి తెలిపారు. కార్యక్రమంలో ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ భక్తవత్సలం, సూపరింటెండెంట్ గోపాల్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్స్ అతావుల్లా, బత్తనయ్య, వనీష తదితరులు పాల్గొన్నారు.

ఏఈఎంఎస్ 104లో ఉద్యోగ అవకాశాలు
కడప రూరల్: అరబిందో ఎమర్జెన్సీ మెడికల్ సర్వీస్ (ఏఈఎంఎస్) 104లో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని ఆ సంస్థ మేనేజర్ సుబ్బయ్య తెలిపారు. డ్రైవర్ పోస్టుకు 10వ తరగతి ఉత్తీర్ణులై హెవీ లైసెన్స్ కలిగి ఉండాలని ఆయన పేర్కొన్నారు. డేటా ఎంట్రీ ఆపరేటర్‌కు విద్యార్హత డిగ్రీ, కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి ఉండాలన్నారు. ఈ ఉద్యోగాలకు ఈ నెల 20వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను కడప పాత రిమ్స్‌లోని కార్యాలయంలో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 గంటలలోపు సమర్పించాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబరు 9642535104ను సంప్రదించాలని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో విధులు చేపట్టాల్సి ఉంటుందని వివరించారు.

సిద్దవటం సీతారామయ్య కన్నుమూత



కడప కల్చరల్: జిల్లాలో పర్యాటక రంగం అభివృద్ధికి విశేష కృషి చేసిన సిద్దవటం సీతారామయ్య (94) బెంగళూరులోని తన కుమారుల ఇంటిలో మంగళవారం ఉదయం కన్నుమూశారు. మధ్యాహ్నం బెంగళూరులోనే అంత్యక్రియలు నిర్వహించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కడప శ్రీరామకృష్ణ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా సేవలు అందించిన ఆయన 42 ఏళ్లపాటు వేలాది మందికి స్పోకెన్ ఇంగ్లిషు, వ్యక్తిత్వ వికాసంలో శిక్షణ ఇచ్చారు. కడప నగర అభివృద్ధి కోసం 35 ఏళ్ల క్రితం సిటీ సిటిజన్స్ ఫోరం ఏర్పాటు చేశారు. 30 ఏళ్ల క్రితం ఇంటాక్ జిల్లా కన్వీనర్‌గా ఈ ప్రాంతంలోని ఎన్నో కోటలు, ఆలయాలు తదితర వారసత్వ సంపద రక్షణకు సహచరులతో కలిసి కృషి చేశారు. గండికోట అభివృద్ధి, రాజంపేటలో 108 అడుగుల అన్నమయ్య విగ్రహం ఏర్పాటు, ఒంటిమిట్ట రామాలయానికి ప్రభుత్వ హోదా దక్కడంలో ఈయన కృషి ఎంతో ఉంది. జిల్లా పర్యాటక రంగంపై 30కి పైగా పుస్తకాలు రాశారు. ఆయన మృతి పట్ల ఇంటాక్ కన్వీనర్ చిన్నపరెడ్డి, లయన్స్ జిల్లా అధ్యక్షుడు పోతుల వెంకట్రామిరెడ్డి, రాయలసీమ టూరిజం సంస్థ కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజు, పర్యాటక రంగ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

బీబీఏ ఏపీలో జిల్లా వాసులకు అగ్రస్థానం
కడప స్పోర్ట్స్: బాడీబిల్డింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (బీబీఏ ఏపీ) నూతన కార్యవర్గంలో ఉమ్మడి వైఎస్‌ఆర్ కడప జిల్లాకు కీలక పదవులు దక్కాయి. విజయవాడలో సోమవారం అసోసియేషన్ ఆవిర్భావ ఎన్నికలు నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. బీబీఏ ఏపీ చైర్మన్‌గా ఇంటూరి యశోదానంద కుమార్ (కడప), అధ్యక్షుడిగా నూనె నాగేష్ (కడప), ప్రధాన కార్యదర్శిగా ఎస్.యూనుస్‌బాషా (కడప)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితోపాటు జిల్లాకు చెందిన మరి కొందరికి కీలకమైన పదవులు లభించాయి. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎస్.రషీద్ (కడప), సంయుక్త కార్యదర్శులుగా ఖలందర్ (కడప), గిరిధర్ (అన్నమయ్య), జడ్జిల కమిటీ సభ్యులుగా ఫయాజ్, మస్తాన్ (అన్నమయ్య), ఇ.సి.మెంబర్లుగా మెహరాజ్ (కడప), హఫీజ్ (అన్నమయ్య)లను ఎన్నుకున్నారు.

ఆర్టీసీ సంక్రాంతి ఆఫర్

- జిల్లాలోని ఐదు డిపోల నుంచి వివిధ నగరాలకు ప్రత్యేక బస్సులు
- సాధారణంగా తిరిగే బస్సులతోపాటు అదనపు సర్వీసులు
- వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఆర్టీసీ ప్రత్యేక చర్యలు
- సాధారణ చార్జీలతో గమ్యస్థానాలకు చేర్చేందుకు జగన్ సర్కార్ నిర్ణయం
- హైదరాబాదు, బెంగుళూరు, చెన్నై తదితర నగరాలకు 80 ప్రత్యేక బస్సులు



మదనపల్లె బస్టాండులో నిలిచివున్న బస్సులు

సాక్షి రాయచోటి: ప్రజా రవాణా సంస్థకు కష్టనష్టాలు ఎన్ని ఉన్నా ప్రయాణికుల సౌకర్యమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు కదులుతోంది. ఆర్టీసీకి సంబంధించి పలు ఇబ్బందులు ఎదురవుతున్నా ప్రజల అవసరాలకే పెద్దపీట వేస్తూ వస్తోంది. దసరా, దీపావళి, సంక్రాంతితోపాటు ఇతర పండుగలు, జాతర్లు వచ్చినా ప్రజల సౌకర్యం కోసం బస్సులను నడుపుతూ వస్తున్నారు. అత్యంత ముఖ్యమైన పండుగలతోపాటు సెలవులు అధికంగా లభించే పండుగల్లో విజయదశమి తరువాత సంక్రాంతిని ప్రముఖంగా చెప్పుకోవచ్చు. ప్రజలపై అదనపు భారం పడకుండా ప్రత్యేకంగా గత ఏడాదితోపాటు ఈసారి కూడా దూర ప్రాంతాలకు సాధారణ ఛార్జీలతో బస్సులను నడపాలని జగన్ సర్కార్ తీసుకున్న నిర్ణయంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. దీనికితోడు ప్రైవేటు ట్రావెల్స్‌లో రెట్టింపు ఛార్జీలు వసూలు చేస్తుండడం, ప్రయాణ విషయంలో భద్రతత అంతంత మాత్రమే కాబట్టి అందరూ ఆర్టీసీ ప్రయాణానికి ఆసక్తి చూపుతున్నారు. పండుగ నేపథ్యంలో కొద్ది రోజుల ముందుగానే అటు ఆర్టీసీలోనూ, ఇటు రైళ్లల్లోనూ ప్రయాణికులు టిక్కెట్లు బుక్ చేసుకున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడటంలో భాగంగానే ప్రజా రవాణా సంస్థ సాధారణ బస్సులతోపాటు ప్రత్యేక బస్సులను నడిపేందుకు సిద్ధమైంది.

జిల్లాలో మొత్తం ఆర్టీసీ డిపోలు:	05
ప్రతిరోజు రూట్ల వారీగా తిరిగే బస్సులు:	448
'సంక్రాంతి'ప్రత్యేక సర్వీసులు :	80
దూర ప్రాంతాల నుంచి సొంతూర్లకు వచ్చే వారి సంఖ్య: సుమారు	20-25 వేలు

సంక్రాంతి నేపథ్యంలో ప్రత్యేక బస్సులు

అన్నమయ్య జిల్లాలోని పలు డిపోల నుంచి ప్రత్యేకంగా ప్రజా రవాణా సంస్థ ప్రయాణికుల సౌకర్యార్థం పలు బస్సులను నడుపుతోంది. ప్రధానంగా హైదరాబాదు, బెంగుళూరు, చెన్నై, విజయవాడలకు బస్సు సర్వీసులను తిప్పుతోంది. టీడీపీ హయాంలో స్పెషల్ బస్సుల పేరుతో ఛార్జిపైన అదనంగా 50 శాతం పెంచి ప్రజల నడ్డి విరిచేది. గత మూడేళ్లుగా వైఎస్ జగన్ సర్కార్ ప్రజలపై అదనపు భారం పడకుండా ప్రత్యేక బస్సులు వేయిడంతోపాటు సాధారణ ఛార్జీలతోనే రవాణా సౌకర్యాన్ని కల్పిస్తోంది. జిల్లాలోని రాయచోటి, మదనపల్లె-1, 2, పీలేరు, రాజంపేట డిపోల నుంచి సుమారు 80 బస్సులను వివిధ నగరాలకు స్పెషల్ సర్వీసులుగా నడిపేందుకు ప్రణాళిక రూపొందించారు. హైదరాబాదుకు 5, బెంగుళూరుకు 38, చెన్నైకి 6, విజయవాడకు 6, తిరుపతికి 25 సర్వీసులను కలుపుకుని 80 సర్వీసులను నడపనున్నారు. ఇవే కాకుండా అవసరాన్ని బట్టి మరికొన్ని సర్వీసులను అప్పటికప్పుడు పెంచుకునేందుకు వీలుగా రవాణా అధికారులు కసరత్తు చేస్తున్నారు. అలాగే రోజువారి 43 సర్వీసులు సుదూర ప్రాంతాలకు ప్రతిరోజు తిరుగుతున్నాయి. తిరుపతి ప్రాంతంలో అధిక మంది విద్యార్థులు చదువుకుంటున్న తరుణంలో ఎక్కువ బస్సులను నడుపుతున్నారు.

సంక్రాంతి డిమాండ్: అన్నమయ్య జిల్లాలోని మదనపల్లె, పీలేరు, రాజంపేట, రైల్వేకోడూరు, రాయచోటి, తంబళ్లపల్లె ప్రాంతాల్లోని వేలాది మంది హైదరాబాదు, చెన్నై, బెంగుళూరు, విజయవాడ, విశాఖపట్టణం తదితర ప్రాంతాల్లో విద్యతోపాటు ఉద్యోగ, వ్యాపార రీత్యా స్థిరపడ్డారు.భోగి, సంక్రాంతి,కనుమ పండుగల సందర్భంగా విద్యార్థులకు పది రోజులకు వరకు సెలవులు ఇచ్చినందున సొంతూర్లకు రానున్నారు. ప్రతి ఏడాదిలాగానే ఈసారి కూడా టిక్కెట్ రిజర్వేషన్ చేసుకునేందుకు డిమాండ్ ఏర్పడింది. రైళ్లలో ముందస్తుగానే ఒకరోజు అటు, ఇటుగా దాదాపు నెల ముందే తమ టిక్కెట్లను రిజర్వు చేసుకున్నారు. ఆర్టీసీ బస్సుల్లో కూడా స్వస్థలాలకు వచ్చేందుకు ముందస్తు రిజర్వేషన్లు చేయించుకుంటుండడంతో సీట్లకు డిమాండ్ ఏర్పడింది. దీంతో ఎంపీ, ఎమ్మెల్యే కోటా సీట్లకు అవసరమైన లెటర్లను తీసుకెళ్లి సీట్లు రిజర్వు చేయించుకుంటున్నారు.

ఈ నెల 11 నుంచి బస్సులు



సంక్రాంతి పండుగ నేపథ్యంలో అన్నమయ్య జిల్లా నుంచి వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్న సాధారణ సర్వీసులతోపాటు ప్రత్యేక సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలి. ఈనెల 11 నుంచి ప్రయాణీకుల అవసరాన్ని, డిమాండును దృష్టిలో పెట్టుకుని ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకునేందుకు ప్రత్యేకంగా పండుగ స్పెషల్‌సర్వీసులు ప్రారంభిస్తున్నాం. జిల్లాలోని రాజంపేట, పీలేరు, మదనపల్లె, రాయచోటి డిపోల నుంచి పలు సర్వీసులు నడవనున్నాం. వాటికి సంబంధించి ప్రజలు సాధారణ చార్జిలతోనే ప్రయాణించవచ్చు. హైదరాబాదు, విజయవాడ, బెంగుళూరు, చెన్నైల నుంచి వచ్చివెళ్లే వారికి ఈ సర్వీసులను వినియోగించుకోవాలి. జిల్లా వ్యాప్తంగా 80 స్పెషల్ బస్సులతోపాటు మరో 43 రోజువారి సర్వీసులు నడుపుతున్నాం. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలి.

– పి.రాము, జిల్లా ప్రజారవాణాధికారి, రాయచోటి, అన్నమయ్య జిల్లా

ప్రణాళికాబద్ధమైన కార్యాచరణ ముఖ్యం



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ, జిల్లా పంచాయతీ అధికారిణి ధనలక్ష్మి

రాయచోటి అర్బన్: ప్రణాళికాబద్ధమైన కార్యాచరణతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని జెడ్పీ ముఖ్యకార్యనిర్వహణాధికారిణి, జిల్లా పంచాయతీ అధికారిణి ధనలక్ష్మి అన్నారు. మంగళవారం స్థానిక భాస్కర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ కళాశాలలో గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ) తయారిపై జిల్లాస్థాయి, మండలస్థాయి అధికారులు, విస్తరణాధికారులు, అనుబంధశాఖ మండల స్థాయి అధికారులకు రెండురోజుల శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభివృద్ధి ప్రణాళికలను తయారు చేసుకునే బాధ్యత కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలపైనే కాకుండా స్థానిక ప్రభుత్వాలైన గ్రామపంచాయతీ, మండల ,జిల్లా ప్రజాపరిషత్‌లకు కూడా ఉందన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే పంచాయతీ, మండల, జెడ్పీస్థాయిలలో అభివృద్ధి ప్రణాళికలు తయారుచేసుకోవాల్సి ఉందన్నారు. అనంతరం సీనియర్ ఫ్యాకల్టీ మమత మాట్లాడుతూ జీపీడీపీ ప్రణాళిక తయారీ ముఖ్య ఉద్దేశ్యము, 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఏ విధంగా ప్రణాళికా బద్ధంగా పనులు చేపట్టాలో వివరించారు. వివిధశాఖలకు చెందిన ఆర్‌డబ్ల్యూఎస్, డీఆర్‌డీఏ, సోషల్ వెల్ఫేర్ శాఖలకు చెందిన జిల్లా అధికారులతో పాటు డీఎల్‌పీఓలు, పీఆర్‌అండ్‌ఆర్‌డీ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, రీసోర్స్‌పర్సన్స్ పాల్గొన్నారు.



శిక్షణా కార్యక్రమానికి హాజరైన అధికారులు

బాబువి దిగజారుడు రాజకీయాలు

- 2019 ఎన్నికల మేనిఫెస్టోతో మేము ప్రజల్లోకి వస్తాం..
- బాబూ.. 2014 ఎన్నికల హామీలు అమలును బయట పెట్టగలవా?
- టీడీపీ అధినేత చంద్రబాబుకు సవాల్ విసిరిన ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

కడప రూరల్: దిగజారుడుతనానికి నిలువుటద్దం చంద్రబాబునాయుడు అని రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఆయనకు ధైర్యం ఉంటే 2014 ఎన్నికల్లో ఇచ్చిన హమీలు, వాటిని అమలు చేసిన తీరును ప్రజలకు వివరించాలని.. అలాగే తాము 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఇచ్చిన మేనిఫెస్టో అమలుపై ప్రజల్లోకి వెళతామని, ఇందుకు చంద్రబాబు సిద్ధమేనా అని సవాల్ విసిరారు. వైఎస్సార్ జిల్లా కేంద్రమైన కడపలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అధికారంలోకి రావడానికి దిగజారుడు రాజకీయాలకు పాల్పడడం చంద్రబాబుకే సాధ్యమన్నారు. టీడీపీకి 175 స్థానాల్లో పోటీ చేసే దమ్ము లేదన్నారు. అడ్డదారుల్లో సీఎం కావడానికి ఆయన చేయని ప్రయత్నం అంటూ లేదన్నారు. అందులో భాగంగా ఓట్లు చీలిపోకూడదని జనసేనతో జత కట్టారని అన్నారు. చంద్రబాబు జీవితం మొత్తం కుట్రలు.. కుతంత్రాల మయం అని తెలిపారు. చంద్రబాబు హంద్రీ నీవా, గాలేరు నగరికి అడ్డుకట్ట వేస్తే.. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆ ప్రాజెక్టులను పూర్తి చేశారని తెలిపారు. ఆయన రాజకీయ ఎత్తుగడలో భాగంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుటుంబంలో విభేదాలు సృష్టించారన్నారు. ఆయన నీచ రాజకీయాల వల్లనే రాష్ట్రం విడిపోయిందని ఆరోపించారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హమీల కంటే రికార్డ్ స్థాయిలో ఎక్కువే నెరవేర్చారని, ఇదొక గిన్నిస్ రికార్డ్‌గా చెప్పుకోవచ్చని అన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలయ్యాయని అన్నారు. ప్రజల మద్దతుతో వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీనే అఖండ విజయం సాధిస్తుందని అన్నారు. సోషల్ వెల్ఫేర్ బోర్డ్ చైర్మన్ సునీల్‌కుమార్, 20వ డివిజన్ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి శ్రీరంజన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఫైనాన్స్ ఉద్యోగిని వ్యవహారంపై విచారణ
కడప అర్బన్: కడప నగరం అప్సరా కూడలి సమీపంలోని ఓ ఫైనాన్స్ సంస్థలో పని చేస్తున్న మహిళా ఉద్యోగి సౌజన్య వ్యవహారంపై పోలీసులు సమగ్రంగా విచారణ చేపట్టారు. ఆమె ఎంత మంది దగ్గర బంగారు ఆభరణాలను తీసుకుని తమ సంస్థలో తాకట్టు పెట్టింది? ఏ మొత్తంలో వడ్డీలకు ఆశచూపి ఎలా మాయ చేసిందో తెలుసుకునేందుకు దర్యాప్తు చేస్తున్నారు. త్వరలో ఆమెను అదుపులోకి తీసుకుని విచారణ చేయనున్నట్లు సమాచారం.

దళారులను నమ్మి మోసపోవద్దు
కడప కోటిరెడ్డిసర్కిల్: వైఎస్సార్ జిల్లాలోని మహిళా శిశు సంక్షేమ శాఖలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ వర్కర్స్, మినీ వర్కర్లు, హెల్పర్ల పోస్టుల భర్తీలో అభ్య ర్థులు దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని జిల్లా మహిళా శిశు సంక్షేమ, సాధికారిత అధికారి శ్రీలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. కొందరు దళారులు పోస్టులు ఇప్పిస్తామని ఆశలు చూపి డబ్బులు తీసుకునే ప్రయత్నం చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నా రు. దళారులపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి

జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి

కడప సెవెన్‌రోడ్స్: రానున్న వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా పరిషత్ చైర్మన్ అమర్‌నాథరెడ్డి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన స్థాయీ సంఘాల సమావేశంలో పలు అంశాలపై ఆయన మాట్లాడారు. ఈ ఏడాది వర్షాలు తక్కువగా పడినందువల్ల భూగర్భ జలాలు అడుగంటడంతో వేసవిలో చాలా గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉందన్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు సీపీడబ్ల్యూఎస్ పథకాలను సక్రమంగా నిర్వహించాలన్నారు. అవసరమైన చోట్ల తాగునీటి రవాణా, వ్యవసాయ బావులు అద్దెకు తీసుకోవడం, డీపెనింగ్ ఆఫ్ బోర్‌వెల్స్ వంటి చర్యలు తీసుకోవాలని సూచించారు. నీటి రవాణా బిల్లులన్నీ చెల్లించామని తెలిపారు. భూగర్భ జలాలు చాలా లోతులో ఉండడం వల్ల హ్యాండ్ పంపులు పని చేయవని తెలిపారు. నదీ పరివాహక ప్రాంత గ్రామాల్లో అవసరమైతే హ్యాండ్ పంపులు ఏర్పాటు చేసే వీలుంటుందని ఒక ప్రశ్నకు సమాధానంగా తెలిపారు. జిల్లాలో జగనన్న కాలనీలు, సామాన్య ప్రజల ఇతర అవసరాలకు ఇసుక కొరత రాకుండా చూడాలన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కింద ప్రతి గ్రామ సచివాలయానికి రూ.20 లక్షలు ప్రభుత్వం కేటాయిస్తోందన్నారు. జిల్లాలో 2200 పనులను రూ.100 కోట్ల అంచనా వ్యయంతో అధికారులు చేపట్టారని తెలిపారు. అనంతరం పోరుమామిళ్ల జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు కరీముల్లా, వేంపల్లె జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, బి.కోడూరు జెడ్పీటీసీ దావీదు, జెడ్పీటీసీ శివప్రసాద్‌రెడ్డి తమ ప్రాంతాల్లోని సమస్యలను ప్రస్తావించారు. జెడ్పీ ఉపాధ్యక్షులు బాలయ్య, సీఈఓ సుధాకర్‌రెడ్డి, డిప్యూటీ సీఈఓ రమణారెడ్డి పాల్గొన్నారు.

ఇంటింటికీ కుళాయి!

- 2020 కుటుంబాల లెక్క ప్రకారం జిల్లాలో 3.69 లక్షల కుళాయిలు ఏర్పాటు
- కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో పనులు
- ఈనెల 6తేదీకే ప్రక్రియ సంపూర్ణం
- వందశాతం పూర్తిపై ధృవీకరణ పత్రాల సేకరణ
- కొత్తగా నిర్మితమైన కుటుంబాలపై తాజాగా సర్వే



బి.కొత్తకోట: ఒకప్పుడు తాగునీటి కోసం మహిళలు బిందెలతో మైళ్ల దూరం కాలినడక వెళ్లి నీళ్లు తెచ్చుకునేవారు. దీనికోసం గంటల తరబడి సమయం పట్టేది. ఆ పరిస్థితుల నుంచి మహిళలకు విముక్తి కలిగించాలన్న సదాశయంతో ప్రభుత్వం ప్రతి ఇంటికి తాగునీటి కొళాయిలను ఏర్పాటు చేయించింది. ఇప్పుడు ఇంటివద్దే నీళ్లు అందుబాటులోకి తెచ్చారు. 2020 కుటుంబాల సంఖ్య ఆధారంగా చేపట్టిన కొళాయిల ఏర్పాటు పనులు శనివారం నాటికి వంద శాతం పూర్తయ్యాయి. నూటికి నూరు శాతం కొళాయి కనెక్షన్ కలిగిన కుటుంబాలుగా అన్నమయ్య జిల్లా రికార్డు సాధించింది. స్వచ్ఛమైన తాగునీటిని అందించడం కోసం ప్రభుత్వం చేపట్టిన చర్యలు సత్ఫలితాలనిస్తోంది. కేంద్ర జల్‌జీవన్ మిషన్-రాష్ట్ర ప్రభుత్వం కలిసి మంజూరు చేసిన నిధులను దీనికోసం వెచ్చించారు.

3.69 లక్షల గృహాలకు

జిల్లాలో 2020 నాటికి గ్రామీణ ప్రాంతాల్లో 3,69,375 కుటుంబాలు ఉన్నట్టు లెక్క తేలింది. దీని కోసం గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు పరిశీలనలు చేపట్టి పనులు ప్రారంభించారు. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఈ పథకం అమలు కోసం జిల్లాకు రూ.417.08 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులను తాగునీటి కుళాయిల ఏర్పాటు కోసం వినియోగించారు. ప్రతిఇంటి వద్దకు కుళాయిలు తీసుకెళ్లడానికి వీలుగా పైప్‌లైన్లు నిర్మించారు. ఇప్పటికే గ్రామాల్లో ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఏర్పాటు చేసి పైప్‌లైన్ల నుంచి కనెక్షన్లను ఇచ్చారు. పైప్‌లైన్ వ్యవస్థ లేనిచోట్ల కొత్తవి నిర్మించారు. దీనికోసం జిల్లాలో 10 కిలోమీటర్లకుపైగా కొత్త పైప్‌లైన్ నిర్మించారు. రూ.52.09 కోట్లలో అధిక ఖర్చు ఇప్పటి దాకా కుళాయిల కోసమే చేశారు. దీంతో శనివారం నాటికి జిల్లాలో వందశాతం కుళాయిలను ఏర్పాటు చేసిన జిల్లాగా రికార్డు దక్కించుకొంది. మొత్తం 3,69,375 కుటుంబాలకు గానూ 3,69,138 కనెక్షన్లు ఇచ్చారు. మిగిలిన వాటి వివరాలు అప్‌లోడ్ చేస్తున్నారు.

కొత్తవాటిపై సర్వే

2020 తర్వాత జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో కొత్తగా ఇళ్ల నిర్మాణాలు జరిగాయి. కొత్త గృహాల సంఖ్య వివరాలు అధికారుల వద్ద లేవు. పనులు ప్రారంభించడానికి ముందు అందుబాటులోని కుటుంబాల సంఖ్య ఆధారంగా కుళాయి కనెక్షన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుని పూర్తి చేశారు. ప్రస్తుతం మళ్లీ సర్వే చేపట్టారు. కొత్త ఇళ్ల సంఖ్య, వాటి వివరాలను సేకరణ ప్రక్రియ పూర్తయ్యాక వీటికి కుళాయిలను ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టనున్నారు.

ఈనెల 6వతేదీ నాటికి ఏర్పాటైన కుళాయిల సంఖ్య

నియోజకవర్గం	కుటుంబాలు	కొళాయిలు
రాయచోటి	57,166	57,106
రాజంపేట	57,838	57,838
కోడూరు	65,545	65,545
మదనపల్లె	45,516	45,516
తంబళ్లపల్లె	71,192	71,176
పీలేరు	72,118	72,118

సరఫరాపై పరిశీలన




గ్రామీణ ప్రాంతాల్లో కుళాయిల ఏర్పాటు పూర్తికావడంతో నీటి సరఫరాపై దృష్టి పెట్టాం. నీళ్లు సక్రమంగా అందుతున్నాయా లేదా, అందితే సరఫరా ఎలా ఉంది, లోటుపాట్లు ఏమిటి అన్న అంశాలను పరిశీలించి చర్యలు తీసుకుంటున్నాం. తాజా సర్వే ఆధారంగా కొత్తగా గుర్తించే గృహాలకు కుళాయి కనెక్షన్లు ఇచ్చేలా చర్యలు తీసుకుంటాం.

–అబ్దుల్‌మతీన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ, మదనపల్లె

ధ్రువీకరణ పత్రాల సేకరణ

గ్రామీణ ప్రాంతాల్లో కొళాయిల ఏర్పాటు వందశాతం పూర్తి కావడంతో అధికారులు ధృవీకరణ పత్రాలను సేకరిస్తున్నారు. తమ గ్రామంలో కొళాయిల ఏర్పాటు వందశాతం పూర్తయ్యిందని తెలిపే పత్రాలను సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి ధృవీకరించి పత్రాలు ఇవ్వాలి. వీటిని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఇప్పటికే పూర్తయిన పంచాయతీల నుంచి 60శాతానికిపైగా పత్రాలను సేకరించారు. మిగిలిన పంచాయతీల నుంచి సేకరిస్తున్నారు.

ఏపీ ఎన్నికల్లో పోటీకి వీసీకే పార్టీ సిద్ధం
- ఎమ్మెల్యేలు షానవాజ్, బాలాజీ



మాట్లాడుతున్న వీసీకే ఎమ్మెల్యేలు మహమ్మద్‌షానవాజ్, బాలాజీ తదితరులు

మదనపల్లె: రాష్ట్రంలో త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లోని 175 అసెంబ్లీ, 25 పార్లమెంట్ స్థానాల్లో పోటీచేసేందుకు వీసీకే పార్టీ అభ్యర్థులు సిద్ధంగా ఉన్నారని, ఆ పార్టీ తమిళనాడు ఎమ్మెల్యేలు మహ్మద్ షానవాజ్, బాలాజీ తెలిపారు. అన్నమయ్య జిల్లా మదనపల్లెలోని ఓ ఫంక్షన్ హాల్‌లో వీసీకే పార్టీ ఎన్నికల సన్నాహక సదస్సు నిర్వహించారు. వీసీకే పార్టీ రాష్ట్రప్రధాన కార్యదర్శి పీటీఎం శివప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తమిళనాడులోని నాగపట్నం ఎమ్మెల్యే మహమ్మద్ షానవాజ్, తిరుపోరూర్ ఎమ్మెల్యే ఎస్.ఎస్.బాలాజీ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. సదస్సు ప్రారంభానికి ముందు ఆధునిక భారత తొలి ముస్లిం ఉపాధ్యాయురాలు, విద్యాభారత వైతాళికురాలు ఫాతిమాషేక్ జయంతి సందర్భంగా చిత్రపటానికి పుష్పమాల సమర్పించి నివాళులు అర్పించారు. అనంతరం ఎమ్మెల్యేలు మాట్లాడుతూ..మోదీ ప్రభుత్వం దేశసంపదను కార్పొరేట్ కుబేరుల దోసిట్లో పోసి.. పేద, మధ్యతరగతి ప్రజల హక్కులను కాలరాస్తోందన్నారు. కార్యక్రమంలో వీసీకే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఇన్‌చార్జి బాలసింగం, ఏపీ దళితసమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ముపాలెం శ్రీనివాస్, వీసీకే రాష్ట్రనాయకులు గణపతి, ముత్యాలమోహన్, పీర్‌బాషా, ప్రభు, పాలకుంట శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ముగ్గురు కోడిపందెం రాయుళ్ల అరెస్టు

మదనపల్లె : కోడిపందేలు ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు టూటౌన్ ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. మంగళవారం పట్టణంలోని టమాటా మార్కెట్‌యార్డు వెనుకవైపు కోడి పందేలు ఆడుతున్నారన్న సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేశామన్నారు. రామారావు కాలనీకి చెందిన పి.రమణారెడ్డి, డి.రమణయ్య, చౌడేశ్వరినగర్‌కు చెందిన ఎస్.కేశవలను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి మూడుకోళ్లు, రూ.6,510 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

సారా విక్రేత అరెస్టు

మదనపల్లె : అక్రమంగా సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు తాలూకా సీఐ ఎన్.శేఖర్ తెలిపారు. మంగళవారం నక్కలదిన్నె భువనేశ్వరి గుడి సమీపంలో సారా విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో దాడిచేశామన్నారు. నక్కలదిన్నెకు చెందిన రాజానాయక్(40) సారా విక్రయిస్తుండగా, అదుపులోకి తీసుకుని అతడి వద్ద నుంచి 8లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

మదనపల్లె : వేర్వేరు ప్రమాదాల్లో ద్విచక్రవాహనాలు అదుపుతప్పి ముగ్గురు వ్యక్తులు గాయపడి స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కురబలకోట మండలం కొత్తవడ్డిపల్లెకు చెందిన మాసన్న కుమారుడు ఆర్.చినస్వామి(55) వ్యక్తిగత పనులపై మదనపల్లెకు వచ్చాడు. తిరిగి వెళుతుండగా, చిప్పిలి సమీపంలోని హంద్రీనీవా కాలువ వద్ద వాహనం అదుపుతప్పి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. అదేవిధంగా వాల్మీకిపురానికి చెందిన వేణుగోపాల్ భార్య సి.రాధమ్మ(40) ద్విచక్రవాహనంలో వెళుతూ, అదుపుతప్పి కిందపడి గాయపడింది. అదేవిధంగా కురబలకోట మండలం దొమ్మన్నబావికి చెందిన రాజారెడ్డి కుమారుడు ఎ.అమరనాథరెడ్డి ద్విచక్రవాహనంలో మదనపల్లెకు వస్తూ చేనేతనగర్ వద్ద అదుపుతప్పి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు బాధితుడిని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

- నేడు 2018 బ్యాచ్ ప్రభుత్వ దంత వైద్య విద్యార్థుల స్నాతకోత్సవం
- సర్వతోముఖాభివృద్ధి దిశగా 'కడప ప్రభుత్వ దంతవైద్యకళాశాల'
- ప్రతి రోజూ 100 నుంచి 150 మందికి దంతవైద్య పరీక్షలు

కలలు కన్నారు.. సాకారం చేసుకున్నారు



కడప నగరంలోని ప్రభుత్వ దంతవైద్య కళాశాల



దంత వైద్య సేవలో విద్యార్థులు (ఫైల్)

కడప అర్బన్ : కడప రిమ్స్ ఆవరణంలో 2008–09 విద్యా సంవత్సరంలో 100 సీట్లతో 'ప్రభుత్వ దంత వైద్య కళాశాల'ను దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి స్థాపించారు. 2009 జనవరిలో ఈ కళాశాల భవన సముదాయాన్ని వైఎస్సార్ ప్రారంభించగా 2008–09 బ్యాచ్‌లో 100 మంది విద్యార్థులకు అవకాశం లభించింది. భారతీయ దంతవైద్య విద్యామండలి (డీసీఐ) వారు 2013లో గుర్తింపు ఇచ్చారు. 2008–09 విద్యాసంవత్సరం నుంచి ఇప్పటివరకు 16 బ్యాచ్‌ల్లో 1563 మంది దంతవైద్య విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. తరువాత పీజీ దంతవైద్య విద్యార్థుల కోసం 2016–17 విద్యా సంవత్సరంలో గుర్తింపు లభించింది. 2016–17 నుంచి ఇప్పటివరకు 8 బ్యాచ్‌ల్లో 112 మంది పీజీ దంతవైద్య విద్యార్థులు తమ కోర్సు పూర్తి చేసుకున్నారు. వైద్య రంగంలో అడుగుపెట్టాలని కలలుగన్న వందలాది మంది విద్యార్థులు తమ కలలను సాకారం చేసుకుని దంత వైద్యులుగా సేవలందిస్తుండగా.. ఇంకొందరు తాజాగా వైద్యులుగా రాణించేందుకు పట్టాలు అందుకోనున్నారు.

నేడు 2018 బ్యాచ్ దంత వైద్య విద్యార్థుల స్నాతకోత్సవం

- ప్రభుత్వ దంత వైద్య కళాశాల 2018 బ్యాచ్ విద్యార్థుల స్నాతకోత్సవం ఈనెల 10వ తేదీ బుధవారం ఉదయం 10.30 గంటలకు కడప నగర శివార్లలోని విష్ణుప్రియ కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోత్స్న తెలిపారు.
- ఓరల్ మెడిసిన్ అండ్ రేడియాలజీకి మూడు పీజీ సీట్లు, ఓరల్ మాక్సిల్లోఫేసియల్ సర్జరీ విభాగానికి మూడు సీట్లు, పెరియోడాంటిక్స్ విభాగానికి మూడు పీజీ సీట్లు, ప్రాస్తోడాంటిక్స్ విభాగానికి రెండు పీజీ సీట్లు మంజూరయ్యాయి. ఈ 11 పీజీ సీట్లకు గాను భారతీయ వైద్య విద్యామండలి 2019 –20 సంవత్సరంలో గుర్తింపు ఇచ్చింది.
- డీసీఐ నిబంధనల ప్రకారం పెరిగిన పీజీ సీట్లకు అనుగుణంగా 2020–21 విద్యా సంవత్సరంలో అదనంగా 24 మంది బోధనా సిబ్బందిని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేయించారు.
- 2022–23 విద్యాసంవత్సరంలో భారతీయ విద్యామండలి ఓరల్ పెథాలజీ అండ్ మైక్రోబయాలజీ విభాగానికి మూడు పీజీ సీట్లు, కాన్సిక్స్‌నేటివ్ డెంటిస్ట్రీ అండ్ ఎండోడాంటిక్స్ విభాగానికి మూడు సీట్లు, పీడోడాంటిక్స్ విభాగానికి మూడు సీట్లు, ఆర్థోడాంటిక్స్ విభాగానికి మూడు పీజీసీట్లు కొత్తగా మంజూరు చేసింది.
- దంతవైద్య సేవలతో పాటు గ్రామీణ ప్రాంత ప్రజలకు దంతవైద్య సమస్యలపై అవగాహన కలిగించడం, పాఠశాలల్లో విద్యార్థులకు దంతసమస్యల నివారణ కోసం దంతవైద్య శిబిరాలను నిర్వహించడం లాంటి కార్యక్రమాలను వైద్య కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ వైద్య శిబిరాలు పబ్లిక్ హెల్త్ డెంటిస్ట్రీ ద్వారా జరుగుతాయి.

కళాశాలలో అభివృద్ధి ఇలా..

- డీసీఐ తమ పరిశీలనలో సూచించిన వైద్య పరికరాలను నిబంధనల మేరకు డీఎంఈ అనుమతితో సమకూర్చారు.
- ఆంధ్రప్రదేశ్ మౌలిక సదుపాయాలు, అభివృద్ధి సంస్థ(ఏపీఎంఎస్ఐడీసీ) ద్వారా మరికొన్ని పరికరాల కొనుగోలుకు సంబంధిత కంపెనీలకు సరఫరా కోసం ఉత్తర్వులు పంపించారు.
- అదేవిధంగా ప్రభుత్వ బడ్జెట్‌లో దంత సమస్యలకు అవసరమైన సామగ్రిని కొనుగోలు చేశారు.
- ప్రభుత్వం నుంచి వచ్చిన కోటి 11 లక్షల రూపాయలతో అవసరమైన చోట్ల భవనాలకు, చిన్న చిన్న మరమ్మతులు (నీటి, పారిశుధ్య, విద్యుత్) చేయించారు.
- దంతవైద్య కళాశాలలో సరిపడా 45 సీసీ టీవీ కెమెరాలను తరగతి గదులలో, విద్యార్థుల వసతి గృహాలలో ఏర్పాటు చేశారు.
- బోధనకు అవసరమైన ఎల్ఈడీ ప్రాజెక్టర్‌లను సమకూర్చారు.
- విద్యార్థులు స్వయంగా నిర్వహించుకునే విధంగా బాలుర వసతి గృహంలో మెస్‌ను ఏర్పాటు చేశారు.
- కళాశాల భవనంలో అందుబాటులో ఉన్న లిఫ్ట్‌లకు మరమ్మతులు చేయించి వాడుకలోకి తీసుకువచ్చారు.
- ప్రభుత్వ కేన్సర్ హాస్పిటల్ నుంచి ప్రభుత్వ దంతవైద్య కళాశాలలోని ఓపీ, బాలుర, బాలికల హాస్టల్స్ వరకు మంచినీటి పైపులైన్‌ను ఏర్పాటు చేసుకునేందుకు కడప నగర పాలక సంస్థ కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్ చంద్, డీఎంఈ నుంచి అనుమతులను ఇటీవల పొందారు.
- ర్యాగింగ్ చట్ట వ్యతిరేకమని, ఆ నేరానికి విధించే శిక్షలపై అవగాహన కల్పించారు. యాంటీ ర్యాగింగ్ కమిటీని ఏర్పాటు చేశారు.

వైద్య సేవలు ఇలా..

- ప్రభుత్వ దంత వైద్య కళాశాల ద్వారా ప్రతి రోజూ 100 నుంచి 150 మంది ఓపీ వైద్య పరీక్షల కోసం వస్తుంటారు.
- 2021 సంవత్సరంలో 26,525 మంది, 2022లో 29,235 మంది, 2023లో నవంబర్ వరకు 32,663 మంది దంత వైద్య పరీక్షల కోసం ప్రభుత్వ దంతవైద్య కళాశాలకు వచ్చారు.
- కరోనా సమయంలో 'బ్లాక్ ఫంగస్'తో బాధపడుతూ వచ్చిన వారికి దవడ ఎముకలు, ఇతర త్రా ఆపరేషన్‌లను నిర్వహించారు. కృత్రిమంగా ఆర్బిట్స్‌ను అమర్చారు.

అందరి సహకారంతో అభివృద్ధి దిశగా అడుగులు



డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జిల్లా ప్రజలకు వైద్య రంగంలో అందించిన వరం కడప రిమ్స్ ఆవరణంలో స్థాపించిన ప్రభుత్వ దంతవైద్య కళాశాల. ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక సహకారంతోనే పీజీ సీట్లు మరిన్ని పెరిగాయి. ఇక్కడికి దంతవైద్యం కోసం వచ్చే వారందరికీ మెరుగైన వైద్యం అందిస్తున్నాం. డీఎంఈతో పాటు, జిల్లా కలెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్, జిల్లా అధికారులు, రిమ్స్, ప్రభుత్వ దంతవైద్య కళాశాలలోని వైద్యులు, వైద్య విద్యార్థులు, సిబ్బంది సహకారంతో కళాశాల దినదినాభివృద్ధి చెందుతోంది. – డాక్టర్ ఎం. జ్యోత్స్న, ప్రిన్సిపల్, ప్రభుత్వ దంతవైద్య కళాశాల, కడప.



గోరుముద్ద పథకం విద్యార్థులకు వరం



జగన్ మామయ్య వచ్చినప్పటి నుంచి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో రక్తహీనతను తగ్గించేందుకు రాగిజావ, కోడిగుడ్లు, చిక్కీ వంటి పోషకాహారం అందిస్తున్నారు. పిల్లల ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోంది. దేశంలో ఇదో అద్భుతమైన కార్యక్రమం. మన రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లోనే రాగిజావ, ఉడికించిన గుడ్లు పంపిణీ చేస్తున్నారు. ప్రత్యేకంగా గోరుముద్ద పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకురావడం విద్యార్థులకు ఓ వరం.
– ఎమ్.రవికిరణ్, 10వ తరగతి, నీలకంఠ్రావుపేట, రామాపురం మండలం.

మా గ్రామంలోనే ధ్రువపత్రాలను పొందాను



గతంలో కులం, ఆదాయం ధ్రువపత్రాలను పొందాలంటే మీసేవలో దరఖాస్తు చేసుకొని తహసీల్దారు కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి ఉండేది. కార్యాలయంలో వీఆర్ఓ ఉంటే, ఆర్ఐ ఉండరు, వీరిద్దరూ ఉంటే తహసీల్దారు ఉండరు. దీంతో సర్టిఫికెట్లు చేతికి వచ్చే సరికే దాదాపు వారం, పదిరోజులు పట్టేది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారు. సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసిన మరుసటి రోజే సచివాలయానికి వెళ్లి తీసుకున్నాను. ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం పెట్టిన తరువాత వలంటీర్లు ఇళ్లవద్దకు వచ్చి ఆధార్, రేషన్ కార్డులు తీసుకొని పైసా ఖర్చు లేకుండా కులం, ఆదాయం సర్టిఫికెట్లను ఇస్తున్నారు. ఇంత మంచి కార్యక్రమాన్ని చేపట్టిన ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాము.
– ఈరిశెట్టి లక్ష్మణ్ కుమార్, వెంకటాయపల్లి, సిద్దవటం మండలం

ఇల్లు మంజూరు కావడం ఆనందంగా ఉంది



నేను పట్టణంలోని రాజీవ్ నగర్ కాలనీలో అద్దె ఇంట్లో నివాసముంటున్నాను. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో, కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ ఇంటి కోసం హౌసింగ్ కార్యాలయాల చుట్టూ అనేకమార్లు తిరిగినా ఇల్లు మంజూరు కాలేదు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయిన వెంటనే ఆయన చెప్పిన విధంగా అర్హులందరికి ఇల్లు కట్టించి ఇస్తున్నారు. జగనన్న కాలనీలో నాకు కూడా ఇల్లు మంజూరు కావడం ఆనందంగా ఉంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటాం.
– అంజనమ్మ, రాజీవ్ కాలనీ, పులివెందుల

కులంపేరుతో దూషించి దాడికి పాల్పడ్డారని ఫిర్యాదు

మదనపల్లె : భూవివాద గొడవల్లో కొందరు వ్యక్తులు కులంపేరుతో దూషించి, దాడికి పాల్పడ్డారంటూ బాధితుడు మంగళవారం తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి కథనం మేరకు .. మదనపల్లె మండలం బీకేపల్లె పంచాయతీ వైఎస్సార్ కాలనీకి చెందిన బుక్కే మంగేనాయక్ రియల్ వ్యాపారి. ఈ నేపథ్యంలో కొద్దిరోజుల కిందట మండలంలోని కొత్తవారిపల్లెకు చెందిన ఒంటిమిట్ట సిద్ధయ్య, టేకుమాని మునిస్వామి వారసుల నుంచి 3.16 ఎకరాల భూమిని కొనుగోలు చేసి అగ్రిమెంట్ రాసుకున్నారు. అయితే ఇటీవల ఆ భూమిని జేసీబీతో చదును చేసేందుకు ప్రయత్నించగా, మునిస్వామి వారసులు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడంతో ఆవేశానికి గురైన వెంకటరమణ, రెడ్డెప్ప, అరుణ, మల్లక్క, శ్రీదేవి, పుణ్యవతిలు కులంపేరుతో దూషించి దాడికి పాల్పడినట్లు మంగే నాయక్ తెలిపాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కమ్యూనిస్టులదే కీలక పాత్ర



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్రకార్యదర్శివర్గసభ్యుడు ఈశ్వరయ్య

రాయచోటి అర్బన్ : త్వరలో జరగనున్న ఎన్నికల్లో కమ్యూనిస్టులదే కీలకపాత్ర అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య అన్నారు. రాయచోటిలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన ఆ పార్టీ ముఖ్యనేతల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీజేపీ ని నెత్తిన పెట్టుకోవాలని చూస్తున్న చంద్రబాబు ప్రజ లకు ఎలాంటి సంకేతాలిస్తున్నారని ప్రశ్నించారు. రా ష్ట్రానికి ద్రోహం చేసిన బీజేపీతో చంద్రబాబు జతకట్టడం అంటే రాష్ట్ర ప్రజలకు ద్రోహం చేయడమేనని అన్నారు. దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకోవాలంటే ఇండియా కూటమి గెలవాల్సిందే అన్నారు. సమావే శంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, స హాయ కార్యదర్శి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో ఇద్దరు వివాహితలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. తంబళ్లపల్లె మండలం బోయపల్లెకు చెందిన శ్రీరాములు భార్య కె.రాణి(30) కుటుంబ సమస్యలతో విషపు గుళికలు మింగింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను తంబళ్లపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం ఆమెను మెరుగైన వైద్యం కోసం మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అదేవిధంగా మదనపల్లె గాంధీపురానికి చెందిన భాస్కర్ భార్య అమ్ములు(30) కుటుంబ సమస్యలతో పురుగుమందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసులు విచారణ చేస్తున్నారు.

పేకాట స్థావరంపై దాడి

మదనపల్లె : పేకాట స్థావరంపై దాడిచేసి 8మంది జూదరులను అరెస్టు చేసినట్లు తాలూకా సీఐ ఎన్.శేఖర్ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని చీకలబైలు పంచాయతీ బార్లపల్లె సమీపంలోని కూకటిమానుగడ్డ పరిసర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున పేకాట ఆడుతున్నారని సమాచారం అందిందన్నారు. దీంతో సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. అందులో కోటమల్లదిన్నెకు చెందిన వెంకటరమణ, మాలేపాడుకు చెందిన రెడ్డెప్పరెడ్డి, నూర్‌బాషా, మదనపల్లెకు చెందిన జగదీష్, నీరుగట్టువారిపల్లెకు చెందిన దామోదర్‌రెడ్డి, దిగువజల్లేపల్లెకు చెందిన డి.వెంకటరమణ, రమేష్‌రెడ్డి, నక్కలదిన్నెకు చెందిన పి.ఆదినారాయణరెడ్డిలను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారివద్ద నుంచి రూ.30,200 నగదు స్వాధీనం చేసుకుని సీజ్ చేశామన్నారు. నిందితులపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ చెప్పారు.

ఆగి ఉన్న లారీని ఢీకొని యువకుడి దుర్మరణం



మృతి చెందిన నరేష్

సంబేపల్లె : కర్నూలు–చిత్తూరు జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి ఆగి ఉన్న లారీని ఢీకొన్న సంఘటనలో నరేష్ (19) అనే యువకుడు మృతి చెందాడు. వివరాలు ఇలా.. సంబేపల్లె మండలం దేవపట్ల పంచాయతీ బండకాడ హరిజనవాడకు చెందిన నరేష్ రాయచోటిలో కాపురం ఉండేవాడు. ద్విచక్ర వాహనంలో దేవపట్లకు వచ్చి తిరిగి వెళ్తుండగా మండల పరిధిలోని మోటకట్ల సమీపంలోకి రాగానే ఆగ ఉన్న లారీని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు.

ఆధిక్యంలో ఆంధ్రా జట్టు



తలపడుతున్న ఆంధ్రా-గోవాజట్లు



వికెట్ పడ్డ ఆనందంలో ఆంధ్రా జట్టు

ఫాలోఆన్ ఆడుతున్న గోవా



అజన్ తోట (116 పరుగులు)



విజయ్ (6 వికెట్లు)



వాసు (3 వికెట్లు)

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహిస్తున్న కల్నల్ సీకే నాయుడు అండర్-23 అంతర్ రాష్ట్రాల క్రికెట్ పోటీలో ఆంధ్రా జట్టు ఆధిక్యంలో కొనసాగుతోంది. ఆంధ్రా జట్టు 4 వికెట్ల నష్టానికి 606 పరుగులు చేసి డిక్లేర్ చేయగా, మూడోరోజు మంగళవారం గోవాజట్టు తొలి ఇన్నింగ్స్ ప్రారంభించింది. గోవా జట్టు 79.2 ఓవర్లలో 226 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని అజన్ తోట 116 పరుగులు చేశాడు. ఆంధ్రా బౌలర్లు టి. విజయ్ 6 వికెట్లు, వాసు 3 వికెట్లు తీశాడు. అనంతరం ఫాలోఆన్‌లో భాగంగా రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన గోవా జట్టు మూడోరోజు ఆట ముగిసే సమయానికి 19 ఓవర్లలో 1 వికెట్ నష్టానికి 61 పరుగులు చేసింది. జట్టులోని అజన్ తోట 35 పరుగులు చేశాడు. ఆంధ్రా బౌలర్లు హేమంత్‌రెడ్డి 1 వికెట్ తీశాడు. దీంతో మూడోరోజు ఆట ముగిసింది. మూడోరోజు ఆట ముగిసే సమయానికి ఆంధ్రా జట్టు 319 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది.

కమర్షియల్ బ్యాంకులతో సమానంగా డీసీసీ బ్యాంకు సేవలు

ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి

కడప అగ్రికల్చర్ : కమర్షియల్ బ్యాంకులతో సమానంగా డీసీసీ బ్యాంకు సేవలను అందిస్తోందని డీసీసీ, ఆప్కాబ్ బ్యాంకు చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి పేర్కొన్నారు. డీసీసీ బ్యాంకు వ్యాపారం రూ. 3 వేల కోట్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం కడప డీసీసీ బ్యాంకు సమావేశ మందిరంలో బ్యాంకు సీఈఓ కందుల రాజేంద్రకుమార్ ఆధ్వర్యంలో కేక్‌ను కట్ చేసి బ్యాంకు సిబ్బందితో సంబరాలను నిర్వహించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ తాను చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టిన 2021 సంవత్సరంలో రూ.13 వేల కోట్లు టర్నోవర్ ఉన్న బ్యాంకు లావాదేవీలను నేడు రూ. 3 వేల కోట్లకు పెంచామన్నారు. ఒకప్పుడు ఇది రైతుల బ్యాంకుగా మాత్రమే పేరు ఉండేదని ఇప్పుడు కమర్షియల్ బ్యాంకులతో సమానంగా అన్ని రకాల రుణాలను అందిస్తోందన్నారు. ప్రస్తుతం ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో 24 బ్రాంచులు ఉన్నాయని మరో నాలుగు కొత్త బ్రాంచులను ఆర్‌బీఐ మంజూరు చేసిందన్నారు. దీంతో పాటు రైతులకు పంట దిగుబడులను దాచుకునేందుకు వీలుగా నాబార్డు సహకారంతో జిల్లాలో 18 గోడౌన్లను నిర్మిస్తున్నామన్నారు. బ్యాంకు సీఈఓ కందుల రాజేంద్రకుమార్ మాట్లాడుతూ బ్యాంకులో ఏవైనా సమస్యలు ఉన్నా, ఎవరైనా డబ్బులు అడిగినా 9966494211 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు డైరెక్టర్లు వీరారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, గంగాద్రి, బ్యాంకు సలహాదారు సహదేవరెడ్డి, బి.కోడూరు సహకార సంఘం అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తుల చట్టాన్ని కఠినంగా అమలు చేద్దాం



వాల్ పోస్టర్లను విడుదల చేస్తున్న అధికారులు

రాయచోటి అర్బన్ : జిల్లాలో పొగాకు ఉత్పత్తుల చట్టం (సీఓటీపీఏ)ను కఠినంగా అమలు చేద్దామని జిల్లా అడిషనల్ ఎస్పీ డాక్టర్ వీబీ రాజ్ కమల్ అన్నారు. మంగళవారం జిల్లా ఎస్పీ కార్యాలయం కాన్ఫరెన్స్‌హాలులో సీఓటీపీఏ చట్టం అమలుపై వైద్య ఆరోగ్యశాఖ, విద్య తదితర శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేసేవారిపై, విద్యాసంస్థలకు 100 మీటర్ల పరిధిలో పొగాకు ఉత్పత్తుల అమ్మకాలు చేసేవారిపైన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ శివప్రతాప్ మాట్లాడుతూ అన్నిరకాల క్యాన్సర్‌లు 40శాతం పొగాకు ఉత్పత్తుల వల్లనే వస్తున్నాయన్నారు. ఒకవైపు వైద్యపరీక్షలు నిర్వహించి క్యాన్సర్‌ను నిర్ధారణ చేస్తూ మరోవైపు అవగాహన కార్యక్రమాలు పక్కాగా నిర్వహించాలన్నారు. జిల్లా ఎన్‌సీడీ కో–ఆర్డినేటర్ శ్రీవాణి మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం సేవించే వారికి రూ. 200 జరిమానా విధిస్తామన్నారు. అనంతరం సీఓటీపీఏ చట్టం వాల్ పోస్టర్‌లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పోలీసు, విద్య, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



మృతి చెందిన వెంకటరమణ

సంబేపల్లె : మండల పరిధిలోని సంబేపల్లె గ్రామం, నామాలగుట్టకు చెందిన కె.వెంకటరమణ (29) సోమవారం రాత్రి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. వెంకటరమణ ట్రాక్టర్ తోలుకుంటూ జీవనం సాగించేవాడు. గత కొద్దిరోజుల క్రితం ట్రాక్టర్‌ను ఫైనాన్స్ కంపెనీ వారు తీసుకెళ్లారు. ఈ క్రమంలోనే సోమవారం రాత్రి ఇంట్లో ఉరివేసుకున్నాడు. వెంటనే కుటుంబ సభ్యులు 108 వాహనం ద్వారా రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, వెంకటరమణ మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.